# కాటికాపరి

-యస్. విక్షిత్‌కుమార్



ఉన్న రెండకారాలు పోగొట్టుకున్న రాజన్నని ఊళ్ళో వాళ్ళు హీనంగా చూశారు. 'ఎవరు చేసుకున్న ఖర్మ వాళ్ళనుభవించక తప్పదు' అన్నారు ఇరుగుపొరుగు వాళ్ళు.

ఆ అవమానాన్ని భరించలేకపోయాడు రాజన్న. ఆ రోజు సాయంకాలం పొలానికెళ్ళాడు.

తను అత్యంత ప్రేమగా చూసుకున్న భూమి, రెక్కలు ముక్కలు చేసుకొని, దున్ని సాగుచేసి అద్దంలా తయారు చేసుకొని పసిడి పంటలు పండించిన భూమి తన అజ్ఞానం కారణంగా చేయి జారిపోయింది.

పొలాన్ని తరచి తరచి చూసుకున్నాడు. నాలుగు మూలలా తిరిగి, ఒక చోట కూర్చొని కన్నీళ్ళెట్టుకున్నాడు. బాధ భరించలేక రోగార్ తాగారు. పొలంలోనే ప్రాణాలొదిలాడు.

సోమక్క ఒంటరిదై పోయింది. భూపతి కాడి కెళ్ళి 'ఇది అన్యాయమని' అరిచింది. అమె మొర పట్టించుకోలేదతను. కసిగా, పచ్చిపచ్చిగా, పిచ్చిపిచ్చిగా తిట్టిపోసింది. అతని దుర్మార్గాన్ని, అవినీతిని ఎండగట్టింది. అయినా గ్రామస్తులు స్పందించలేకపోయారు. అగ్రకులాల వారైతే అస్సలు పంకించనేలేదు. ఈలోగా భూపతికి కోపం వచ్చింది. ఆగ్రహించాడు. తక్షణం బలవంతంగా ఆమెను ఊరెళ్ళ గొట్టించాడు. తిరిగి ఊళ్ళోకొస్తే, జీవితాన్నే నాశనం చేస్తానంటూ కళ్ళెర్రజేసి బెదిరించాడు.

ఊరు పొలిమేర దగ్గర, మర్రిచెట్టు కిందున్న అరుగుమీద, బట్టలు చుట్టుకున్న మూటతో, ఒంటరిగా, పిచ్చిదానిలా, కూర్చుంది సోమక్క.

ఒంటరితరం, ఆందోళన, బాధ, భయం భూపతి తలపెట్టిన దుర్మార్గంకంటే తీవ్రంగా కలవర పెట్టసాగాయి.

చేతిలో పైసాలేదు. ఊళ్ళో భర్తకి తెలిసిన స్నేహితులున్నా చేరదీయలేని పిరికివాళ్ళు. మూర్ఖులు. ఎక్కడికెళ్ళాలో, ఎలా బతకాలో తెలియని నిస్సహాయస్థితి...

ఆదరణలేని అనాధయ్యిందామె. ఏమీ తోచక రెండు రోజులపాటు పస్తుండింది. ఆ చెట్టు కిందే పడుకొంది. అకలి పరమ కిరాతకురాలు కాబట్టి పక్క ఊళ్ళోకెళ్ళి కొన్నాళ్ళు భిక్షాటన చేసి పొట్ట నింపుకుంది. తిరిగి మర్రిచెట్టు కిందికే వచ్చి తల దాచుకొనేది.

ఓ వారం రోజులు గడిశాయి. మర్రిచెట్టు కొద్ది దూరంలో శ్మశాన వాటిక ఉంది. అక్కడున్న కాటి కాపరి పండు ముదుసలి వాడు. సోమక్కని గమనించాడు. ఆమెను చేరదీసి, జరిగిన అన్యాయం తెలుసుకొని జాలిపడి ఆశ్రయం కల్పించాడు. అతని పేరు 'దేవయ్య' అని చెప్పకున్నాడు. ఎవరూ లేని సోమక్కకు ఆయనే ఆపద్బాంధవుడయ్యాడు. అయన్ని తండ్రిలా భావించింది సోమక్క.

రోజులు గడుస్తున్నాయి. సంప్రదాయబద్ధంగా శవాలను ఏ విధంగా దహనం చేస్తారో, సత్రంలో నుండే గమనించేది సోమక్క.

దేవయ్య అనారోగ్యానికి గురయ్యాడు. దాదాపు శక్తి హీనుడయ్యాడు. వచ్చే శవాల్ని దహనం చేయడానికి తనకు బదులు మరొకరు లేరు.

తన తర్వాత సోమక్కకి ఆ బాధ్యత అప్పజెప్పాలనుకున్నాడు. తను చనిపోయినా, సోమక్క తన వృత్తి ద్వారా పొట్ట నింపుకోవడానికి వీలుంటుందని భావించాడతడు.

భారతీయ వైదిక సంస్కృతి ప్రకారం స్త్రీలు శ్మశానంలో అడుగు పెట్టడం అపరాధం. అలాంటిది ఒక స్త్రీ శవాలను దహనం చేయడమనేది సంస్కృతికి విరుద్ధమే కాక, అపచారమౌతుందేమోనని సందేహించింది సోమక్క.

దేవయ్య ధైర్యం చెప్పాడు...

సోమక్కకి తలపాగా చుట్టి, ఆకారంతో పాటూ పేరూ మార్చాడు. సోమక్క 'సోముడు'గా రూపాంతరం చెందింది. కొన్నాళ్ళ తర్వాత—

దేవయ్య మరణించాడు...ఆ రోజు నుంచి జీవితాంతం శ్మశానంలోనే నివాసించాలని దృఢంగా నిశ్చయించుకుందామె. అలా నాలుగేళ్ళపాటు శ్మశానంలోనే ఉండిపోయింది సోమక్క.

XX XX XX

ఒక్క ప్రక్క భూపతి శవాన్ని చూస్తూనే మరో పక్క గతాన్ని స్పృశించింది సోమక్క. శవంగా మారిన భూపతి ముఖం నల్లగా తయారై బొబ్బలు బొబ్బలుగా ఉబ్బి, అక్కడక్కడ ఎర్రగా వాచిపోయి వుంది.

మొత్తానికి ఘోరమైన చావు చచ్చాడు. ఆడదాని ఊసురు ఆడదాని కంట తడి పెట్టించి, అబలగా, హీనంగా చూసినవాడి భవితవ్యం, ఆడదాని మనసు నొప్పించి, చిత్రహింసలు పెట్టిన వాడి చరిత్ర ఏనాడూ సవ్యంగా ముగియలేదు. అర్ధాయుష్షుతో, అర్థాంతరంగా, మధ్యలోనే పరిసమాప్తమైంది! అలాంటి వారి చరిత్రలో ఈనాడు భూపతి... తన కళ్ళ ముందర, తన కాళ్ళ దగ్గర శవంగా పడి ఉన్నాడు. దుర్మార్గులకు, నీచులకు, వంచకులకు కాలక్రమంలో కొంచెం ఆలస్యం జరిగినా, చివరకు కుక్క చావు మాత్రం తప్పదు...

భూపతి శవాన్ని కొందరు వ్యక్తులు చితిపై పడుకోబెట్టారు... దహన సంస్కారం నిర్వహించిన అనంతరం వచ్చిన వాళ్ళంతా వచ్చినట్టే వెళ్ళిపోయారు...

అప్పటికే నలువేపులా చీకటి ఛాయలు అలుముకున్నాయి. శవానికి అంటించిన చితి తాలూకు కాంతి మాత్రం ప్రసరిస్తోంది... ఒక్క ఉదుటున వీచిన చల్లటి ఈదురు గాలి ధాటికి సోమక్క శరీరంలో కొంచెం వణుకు పుట్టింది.. శీతాకాలం కావడం వల్ల చీకటి పడగానే తిన్నగా చలి మొదలవుతోంది...

చితి మంటలకి దగ్గరగా వెళ్ళి చలి కాచుకుంటోందామె!

